# ఎన్నికల రూల్స్‌ను కచ్చితంగా పాటించాలి



చెక్‌పోస్ట్‌ల సీసీ కెమెరాల రికార్డింగ్‌ను పరిశీలిస్తున్న వాగీశ్‌కుమార్ సింగ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి

- వదంతులు ప్రచారం చేయొద్దు
- వార్తలు రికార్డు చేయాలి
- ఎన్నికల వ్యయ పరిశీలకుడు వాగీశ్‌కుమార్ సింగ్
- వాట్సాప్ అడ్మిన్లు జాగ్రత్తగా ఉండాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు టౌన్, నవంబర్ 4 : ఎన్నికల రూల్స్‌ను మీడియా కచ్చితంగా పాటించాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు వాగీశ్‌కుమార్ సింగ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్‌ను (ఎంసీఎంసీ) కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనల వంటి వాటిపై నిఘా ఉంటుందన్నారు. లోకల్ చానెల్స్‌లో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలని సూచించారు. వార్తా పత్రికలు, ఈ–పేపర్లు, టెలివిజన్ చానళ్లు, స్థానిక కేబుల్ నెట్ వర్క్‌లు, సోషల్ మీడియా, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో–వీడియో విజువల్ మీడియాలతో పాటు ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందిన తర్వాతే విడుదల చేయాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించే సమయంలో సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయొద్దన్నారు. ఇతర ప్రాంతాల్లో జరిగిన ఘటనల వీడియోలు ఇక్కడ జరిగినట్లు, పాత వీడియోలను ప్రచారం చేయడం, ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ప్రజలను అయోమయానికి గురి చేయొద్దన్నారు. వదంతులు ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంసీఎంసీ మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు సమాచారం ఫార్వర్డ్ చేయకుండా అడ్మిన్లు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అసత్యాలు వ్యాప్తి చేస్తే అడ్మిన్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం చెక్ పోస్ట్‌ల సీసీ కెమెరాల రికార్డింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డీఎస్ వెంకన్న, డీపీఆర్వో రఫిక్, ఎంసీఎంసీ కమిటీ మెంబర్ ఎస్ శ్రీధర్, కొత్తపల్లి ప్రసాద్‌రావు, ఈడీఎం దేవేందర్, డీటీ సత్యనారాయణ, సోషల్ మీడియా ఇన్‌చార్జి సయ్యద్ అబ్దుల్ రహీం, అసిస్టెంట్లు భవిత, సురేశ్, శ్రీనివాస్, ఏపీవో ఫిరోజ్ పాషా, అడ్మిన్ అసిస్ట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రెండో విడుత నర్సంపేట నుంచి..

- 13 నుంచి ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పర్యటన
- తొమ్మిది చోట్ల ప్రజా ఆశీర్వాద సభలు

ములుగు, నవంబర్ 4(నమస్తే తెలంగాణ) : ఎన్నికల ప్రచార ప్రక్రియలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో రెండో విడుత సభల షెడ్యూల్ ఖరారైంది. పది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి తొమ్మిదిచోట్ల ప్రజా ఆశీర్వాద సభలకు ముఖ్యమంత్రి హాజరుకానున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలను తెలియజెప్పనున్నారు. ఈ నెల 13న నర్సంపేట, 14న పాలకుర్తి, 17న పరకాల, 18న చేర్యాల (జనగామ), 20న స్టేషన్‌ఘన్‌పూర్, 21న డోర్నకల్, 24న ములుగు, భూపాలపల్లి, 28న వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. మొదటి దశ ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ జనగామ, మహబూబాబాద్, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ప్రచారం పూర్తి చేశారు.

## కారుకు ఓటేసి ఆశీర్వదించండి

- మంథని అభివృద్ధిలో ముందంజ
- అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు
- కాంగ్రెస్‌కు ఓటేస్తే అంధకారమే
- బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్
- పట్టణంలో విస్తృత ప్రచారం

మంథని, నవంబర్ 4: కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ కోరారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే నియోజకవర్గం అంధకారమవుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే సొంతలాభం చూసుకొని ప్రజలను గాలికి వదిలేశాడని విమర్శించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని, ఆపదలో ఉన్నవారికి సాయం చేయలేదని దుయ్యబట్టారు. శనివారం పుట్ట మధూకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి మంథని పట్టణ పరిధిలోని బోయినిపేట, దుబ్బగూడెం, తెనుగువాడ, గొల్లగూడెం ఏరియాల్లో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఐదేండ్లు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారని విమర్శించారు. ఇప్పుడు ఓట్ల కోసం ఊర్లకు వచ్చి అబద్ధాలు చెబుతున్నాడన్నారు. నోట్ల కట్టల ద్వారా ఓట్లను కొనుగోలుకు యత్నిస్తున్నాడని ఆరోపించారు. ప్రజలు ఆయన మాయమాటలు నమ్మవద్దన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా, ప్రస్తుతం పెద్దపల్లి జడ్పీ చైర్మన్‌గా, తన సతీమణి శైలజ మంథని సర్పంచ్, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అనేక అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించామని పేర్కొన్నారు. దుబ్బగూడెంలో సీసీ రోడ్డు నిర్మించి ఇక్కడి ప్రజల కష్టాలను తీర్చానన్నారు. తన ఎదుగుదలను ఓర్వలేక కొందరు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 7న మంథనిలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు కదిలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గొల్లగూడెంలో యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎగోలపు శంకర్‌గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు నక్క నాగేంద్ర శంకర్, వీకే రవి, కే సమ్మయ్య, కొట్టే రమేశ్, శ్రీపతి బానయ్య, వెల్పుల గట్టయ్య, ఎంఎస్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు..

బీఆర్ఎస్‌లో చేరికల జోరు కొనసాగుతున్నది. మంథనిలోని రాజగృహలో మంథని మండలం అక్కెపల్లి గ్రామానికి చెందిన యువకులు, కాటారం మండలం దేవరాంపల్లి, కార్యకర్తలు, మహదేవపూర్ మండలం బెగ్లూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల ప్రచార కార్యదర్శి ముత్యాల మల్లా గౌడ్, పంతంగి మొండయ్య, అగె సంపత్, సకినాల లక్ష్మీనారాయణ, మేకల సంపత్, సురేశ్, కార్యకర్తలు, రామగిరి మండలం చందనాపూర్‌కు చెందిన వార్డు సభ్యులు ముస్త్యాల పుష్పలతా సంతోష్, మహదేవపూర్ మండలం ఎన్కపల్లి, కిష్టరావుపేటకు చెందిన 100 మంది కాంగ్రెస్ నేతలు, బోయినిపేటకు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పుట్ట మధూకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### కాళేశ్వరంలో..

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి, బీరసాగర్ గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గడపగడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మ్యానిఫెస్టో, పథకాలను ప్రజలకు వివరించారు. పుట్ట మధూకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీ అనంత రెడ్డి, కావేరి శేఖర్, పిట్టల రమేశ్, చింతల మహేశ్, జౌన మహేందర్, ముల్కల ఆశోక్, జైన వెంకటేశ్, పోటు శ్రావణ్‌రెడ్డి, కోడెపాక మల్లేశ్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంథని : బోయినిపేటలో ప్రచారం చేస్తున్న పుట్ట మధూకర్



కాళేశ్వరం : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య

## తెలంగాణలో కాంగ్రెస్ భూస్థాపితమే..

- రాష్ట్రంలో పార్టీ పూర్తిగా భ్రష్టుపట్టింది
- రూ.కోటి తీసుకొని దొంగ సర్వేలు
- కరెంటుపై మూర్ఖపు మాటలకు కాంగ్రెస్‌కు ఎవరైనా ఓటేస్తారా?
- కేసీఆర్ మూడోసారి సీఎం కావడం చరిత్రాత్మక అవసరం
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

జనగామ, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో పూర్తిగా భ్రష్టుపట్టి పోయిన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత భూస్థాపితం అవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు విద్యుత్ 24గంటలు సరఫరా చేస్తుంటే, 5గంటలు సరిపోతుందంటున్న పార్టీకి ఎవరైనా ఓటేస్తారా ? అని ప్రశ్నించారు. శనివారం జనగామలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నాటక డిప్యూటీ సీఎం శివకుమార్ తెలంగాణ ఎన్నికల ప్రచారంలో 3గంటల కరెంటు అని మూర్ఖంగా మాట్లాడి వెళ్లారని, అలాంటప్పుడు కాంగ్రెస్ నాయకులు ప్రజల వద్దకు ఏ ముఖం పెట్టుకొని ఓట్లకు వెళ్తారని ధ్వజమెత్తారు. రూ.కోటి పెట్టుబడి పెట్టి దొంగ సర్వేలు చేయించుకొని బీసీలు, ముస్లిం, మైనార్టీలకు దక్కాల్సిన సీట్లను అమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నామరూపాల్లేకుండా పోతుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌లో బీసీలను అడుగడుగునా అవమానించడం తప్ప ఆ వర్గాలకు ఏ మాత్రం గౌరవం, గుర్తింపు లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కావాలని అడిగినట్లే.. ఎ న్నికల్లో అణగారిన వర్గాల ఓట్ల ద్వారా లబ్ధి పొందేందుకు ఇన్నేళ్లుగా లేని కులగణన అంశాన్ని అన్ని పార్టీలు లేవనెత్తుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు అనేక మంది చెబుతారు కానీ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కేవలం 3నెలల్లోనే సకల జనుల సర్వే చేయించిన ఘనుడు దేశంలో ఒకే ఒక్కడు అదే కేసీఆర్ అని పొన్నాల అన్నారు. 2014లో స్వరాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే రాష్ట్రంలో కులగణన చేపట్టిన కేసీఆర్‌లో తాను ఆరాటం.. తపన చూశానని అన్నారు. తొమ్మిదిన్నరేండ్ల క్రితమే ఎన్నికల సమయం కాకున్నా ఎవరినీ ప్రభావితం చేయాల్సిన అవసరం లేకున్నా కులగణన తెచ్చి కేసీఆర్ బడుగు, బలహీనవర్గాల పక్షపాతిగా ఉన్నారని చెప్పారు. అందుకే తెలంగాణకు కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం చరిత్రాత్మక అవసరమని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. ఆయన నాయకత్వంలోనే ప్రజల చెంతకు పాలన.. ప్రజల వద్దకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. తాను పదవులు, అధికారం కోసం బీఆర్ఎస్‌లోకి రాలేదని.. గౌరవం ఉండాలని.. బీసీలను గౌరవించే పార్టీల్లో ఉండాలనే గులాబీ కండువా కప్పుకున్నట్లు వెల్లడించారు. గతంలోనే పీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన బీసీ వర్గానికి చెందిన ముగ్గురు కూడా కాంగ్రెస్‌కు రాజీనామా చేశారని తెలిపారు. అప్పుడు వాళ్లూ.. ఇప్పుడు నేను ఎందుకు బయటకు వచ్చానని అధిష్టానం రాజకీయంగా ఏనాడైన ఆలోచించిందా ? బీసీ వర్గాలు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సహకరించారా ? ఏమైనా లోపాలను గుర్తించి.. సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నదా? బీసీలే ఎందుకు దూరమవుతున్నారో గుర్తించారా ? అని పొన్నాల కాంగ్రెస్ అధిష్టానాన్ని ప్రశ్నించారు. 1983 నుంచి గడిచిన 55 ఏండ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్రలో తెలంగాణ ప్రాంతం నుంచి ఆ పార్టీకి ఏనాడూ 50 సీట్లు రాలేదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పరిస్థితి మరింత దిగజారిందని పొన్నాల స్పష్టం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బండ యాదగిరిరెడ్డి, అరీఫ్ తదితరులు ఉన్నారు.

## శబరిమలకు అద్దెకు ఆర్టీసీ బస్సులు

నర్సంపేట, నవంబర్ 4: శబరిమలకు వెళ్లే భక్తులకు అద్దెకు ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ నర్సంపేట డిపో మేనేజర్ ప్రసన్నలక్ష్మి శనివారం తెలిపారు. ఆర్టీసీ ఇటీవల 700లకు పైగా కొత్త సూపర్ లగ్జరీ బస్సులు సమకూర్చుకుందని, సుశిక్షితులైన డ్రైవర్లతో భద్రమైన ప్రయాణానికి అవకాశం కల్పిస్తున్నదని చెప్పారు. ఈ బస్సుల్లో టీవీ, సెల్‌ఫోన్ చార్జింగ్ పాయింట్లు ఉంటాయన్నారు. ఇద్దరు పదేండ్ల మణికంఠ స్వాములు, ఇద్దరు వంట మనుషులు, సామగ్రి సర్దేందుకు ఒక మనిషికి సీటు ఉచితంగా పొందవచ్చన్నారు. ఒకటి, అంతకంటే ఎక్కువ బస్సులు బుక్ చేసిన గురుస్వామి, బుక్ చేసిన వ్యక్తికి బస్సుపై రూ. 300 కమీషన్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. శబరిమలై వెళ్లి వచ్చే దారిలో ఇతర పుణ్యక్షేత్రాలను కూడా దర్శించుకోవచ్చని వివరించారు. పూర్తి వివరాలకు 9959226052 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.